సాక్షి ఖమ్మం

శనివారం : 19 : ఆగస్టు : 2023



పాటగానే జీవించి ఉంటాడు..

ప్రజా యుద్ధనౌక గద్దర్ భౌతికంగా లేకపోయినా పాట రూపంలో జీవించే ఉంటాడని పలువురు వక్తలు పేర్కొన్నారు. 8లో



ముగ్గులతో నిరసన

సర్వీస్ క్రమబద్ధీకరణ కోసం నిరవధిక సమ్మెకు దిగిన సెకండ్ ఏఎన్‌ఎంలు కలెక్టరేట్ ఎదుట ముగ్గులు వేసి నిరసన తెలిపారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 23°

శనివారం జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

5కే రన్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

వైరా: రానున్న సర్వత్రా ఎన్నికల దృష్ట్యా అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించేందుకు శనివారం 5కే రన్ నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. వైరా తహసీల్‌లో శుక్రవారం ఆయన పోలీస్, విద్యాశాఖ అధికారులతో సమావేశమై 5కే రన్ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సాధారణ పౌరులు ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలని తెలిపారు. వైరా క్రాస్ రోడ్డు నుండి అయ్యప్ప దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్ కే.వీ.శ్రీనివాస్, ఏసీపీ ఎం.ఏ.రెహమాన్, సీఐ సాగర్, ఎస్సై మేడా ప్రసాద్, ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల నిధులు విడుదల

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందించే కోడిగుడ్లకు సంబంధించి రూ.80లక్షలకు పైగా నిధులు విడుదలయ్యాయి. విద్యార్థులకు వారంలో మూడు రోజులు గుడ్లు అందిస్తుండగా, జిల్లాలోని 1,216 ప్రభుత్వ పాఠశాలల్లో 78,850 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక్కో గుడ్డుకు రూ.5 చొప్పున గత విద్యాసంవత్సరం ఏప్రిల్, ఈ విద్యాసంవత్సరం జూన్, జూలై నెలల బిల్లు రూ.80,27,760 విడుదల చేశారు. ఈ నిధులు త్వరలోనే మధ్యాహ్న భోజన ఏజెన్సీల ఖాతాల్లో జమ అవుతాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

డీఎంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీలత



శ్రీలతకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్(డీఎం)గా జి. శ్రీలత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జ్ డీఎంగా ఉన్న సోములును యాదాద్రి జిల్లాకు కేటాయించారు. ఈమేరకు శ్రీలత బాధ్యతలు స్వీకరించగా డీఎస్ఓ, డీఎం కార్యాలయాల ఉద్యోగులు, రైస్‌మిల్లర్ల సంఘం నాయకులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సురేందర్, నిస్సార్, సృజన, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో స్టడీ అవర్

నేలకొండపల్లి: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల గడువు ఈనెల 31 వరకు ఉందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని శుక్రవారం తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించడంతో పాటు బోధనపై ఆరా తీశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై సూచనలు చేశారు. అధ్యాపకులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రతీ రోజు స్టడీ అవర్ ఏర్పాటు చేయాలని, విద్యార్థుల హాజరు పెరిగేలా కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎస్.ఎన్.శాస్త్రి, అధ్యాపకులు గురవయ్య, ఆర్.ఆమోస్, సూర్యప్రకాష్‌రావు, సత్యనారాయణ, రవి, శివ, రమాదేవి, నాగశ్రీ, ఏసోబు, బాలకృష్ణ, భాస్కర్, ప్రమోద్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రామాలయంలో 'శ్రావణ' పూజలు



అలంకరణలో లక్ష్మీతాయారు అమ్మవారు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రావణ మాస పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయంలోని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఉపాలయంలో ఉదయం ప్రత్యేక స్నపనం, పంచామృతంతో అభిషేకం జరిపారు. అనంతరం సామూహిక కుంకుమార్చనలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీఆర్ఎస్ టీమ్ రెడీ..



ఉమ్మడి జిల్లాలో పార్టీ అభ్యర్థుల జాబితా సిద్ధం

- సిట్టింగ్‌లు, పాత వారికే మళ్లీ గ్రీన్‌సిగ్నల్
- వైరాలో మాత్రం రాములునాయక్‌కు బదులు మదన్‌లాల్
- పొత్తు కుదిరితే సీపీఎంకు భద్రాచలం స్థానం!
- సర్వేలు, రాజకీయ సమీకరణలకు అనుగుణంగా ఖరారు
- ఈనెల 21న లేదా ఆ తర్వాత జాబితా.. చివరి క్షణాల్లో మార్పులకు అవకాశం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలోని అసెంబ్లీ స్థానాల నుంచి బరిలోకి దిగేందుకు బీఆర్ఎస్ టీమ్ సిద్ధమైంది. అన్ని స్థానాలకు అభ్యర్థులు ఖరారైనట్లు విశ్వసనీయ సమాచారం. మారిన రాజకీయ సమీకరణలు, సర్వేల ఆధారంగా సిట్టింగ్‌లకు, మిగతా చోట్ల గతంలో పోటీ చేసిన వారినే మళ్లీ బరిలోకి దింపేలా నిర్ణయం జరిగినట్లు తెలిసింది. ప్రస్తుతానికి అందిన సమాచారం ప్రకారం వైరా మినహా మిగతా తొమ్మిది నియోజకవర్గాల్లో మార్పులు లేకుండా టికెట్లు ఖరారు చేసినట్లు సమాచారం. వైరాలో ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌ను పక్కన పెట్టి సర్వేల ఆధారంగా బానోతు మదన్‌లాల్ వైపు అధిష్టానం మొగ్గు చూపినట్లు తెలిసింది. ఈనెల 21న లేదా ఆ తర్వాత ఎప్పుడైనా ప్రకటించే బీఆర్ఎస్ అభ్యర్థుల తొలి జాబితాలో ఉమ్మడి జిల్లాలోని ఒక స్థానం మినహా అన్ని స్థానాల నుంచి బరిలోకి దిగే వారి పేర్లు వెల్లడవుతాయని సమాచారం. అయితే, ప్రాథమికంగా జాబితా ఖరారైనా చివరి నిమిషంలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది.

ఒక్కరు మినహా సిట్టింగ్‌లకు సై

తాజా సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఒక్కరు మినహా బీఆర్ఎస్‌లోని సిట్టింగ్‌లకు టికెట్లు ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. పాలేరు నుంచి కందాల ఉపేందర్‌రెడ్డి, ఖమ్మంలో పువ్వాడ అజయ్‌కుమార్, సత్తుపల్లి నుంచి సండ్ర వెంకటవీరయ్య, పినపాక నుంచి రేగా కాంతారావు, అశ్వారావుపేట నుంచి మెచ్చా నాగేశ్వరరావు, ఇల్లెందు నుంచి బానోతు హరిప్రియ, కొత్తగూడెంలో వనమా వెంకటేశ్వరరావు మళ్లీ బరిలో దిగనున్నట్లు తెలిసింది. అలాగే, మధిర, భద్రాచలం నుంచి గతంలో పోటీ చేసిన ఓడిపోయిన లింగాల కమల్‌రాజు, తెల్లం వెంకట్రావు పోటీకి దిగనున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో జరిపిన చర్చల్లో ఈ విషయమై స్పష్టత వచ్చింది. పలుమార్లు చేయించిన సర్వేల ఆధారంగా వీరే బలమైన అభ్యర్థులుగా తేలడంతో పోటీకి సిద్ధంగా ఉండాలని పార్టీ అధిష్టానం సంకేతాలు ఇచ్చింది.

రాములునాయక్‌కు షాక్

ఉమ్మడి జిల్లాలోని పది స్థానాలపై కసరత్తు చేసిన పార్టీ అధిష్టానం వైరా నుంచి సిట్టింగ్‌కు అవకాశం ఇవ్వలేదు. ఇక్కడ ఎమ్మెల్యే రాములు నాయక్‌ను కాదని బానోత్ మదన్ లాల్‌ను బరిలో దింపాలని సర్వేల ఆధారంగానే నిర్ణయం తీసుకున్నారు. రాములునాయక్ గత ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందాక బీఆర్ఎస్‌లో చేరారు. బానోత్ మదన్‌లాల్ గత రెండు పర్యాయాలు వైరా నుంచి పోటీ చేయగా.. 2014లో వైఎస్సార్‌సీపీ నుంచి గెలుపొందారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి 2018లో పోటీ చేసినా స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. అయితే, ప్రస్తుతం చేయించిన సర్వే ఆధారంగా మదన్‌లాల్ వైపే కేసీఆర్ మొగ్గు చూపినట్లు తెలిసింది.

రెండు స్థానాలపై ఆచితూచి..

ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాలపై పార్టీ అధిష్టానం ఆచితూచి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్తగూడెం నుంచి వనమా వెంకటేశ్వరరావు, ఇల్లెందు నుంచి బానోతు హరిప్రియనే పోటీలో దింపేందుకు మొగ్గు చూపినట్లు సమాచారం. కాంగ్రెస్ నుంచి గెలుపొంది బీఆర్ఎస్‌లో చేరిన వీరికి ప్రస్తుత పరిస్థితుల నేపథ్యాన మళ్లీ పోటీకి సంకేతాలు ఇచ్చారని తెలుస్తోంది. ఇల్లెందులో గ్రూపుల కారణంగా సిట్టింగ్‌పై వ్యతిరేకత ఉన్నా ప్రతిపక్ష పార్టీకి హరిప్రియ మాత్రమే పోటీ ఇవ్వగలరనే నిర్ణయానికి అధిష్టానం వచ్చినట్లు సమాచారం. అయితే, ఈ స్థానానికి సంబంధించి చివరి నిమిషంలో మార్పులకు అవకాశం లేకపోలేదన్న ప్రచారం కూడా కొనసాగుతోంది.

ఇప్పటికైతే భద్రాచలం ఓకే..

కాంగ్రెస్ నుంచి ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన తెల్లం వెంకట్రావే పార్టీ అభ్యర్థిగా ఖరారైనట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా సీపీఎం, సీపీఐతో పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని సీపీఎంకు కేటాయించి, బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తెల్లంకు ఉన్నత పదవి కేటాయిస్తారనే చర్చ జరుగుతోంది. ఇప్పటి వరకు ఉభయ కమ్యూనిస్టులతో పొత్తుపై బీఆర్ఎస్ ఎటూ తేల్చకపోగా, తొలి జాబితా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యాన చర్చలు ఎప్పుడు జరుగుతాయో తెలియడం లేదు. తొలి జాబితా విడుదలయ్యేలోగా రెండు పార్టీలతో చర్చలు మొదలైతే భద్రాచలం స్థానాన్ని పెండింగ్‌లో పెట్టే అవకాశముంది. ఏదిఏమైనా కొన్ని నెలలుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అభ్యర్థులపై కొనసాగుతున్న ఉత్కంఠకు అధిష్టానం త్వరలోనే తెరదించనుంది.

సర్వేలన్నీ ఎన్‌డీఏకే అనుకూలం





ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ మైదానంలో పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, నాయకులు (ఇన్‌సెట్) అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

- బీజేపీ హయాంలో నయా పైసా అవినీతి జరగలేదు..
- సెప్టెంబర్ 17న విశ్వ బ్రాహ్మణులకు కొత్త పథకం
- కల్వకుంట్ల కుటుంబం చేతిలో బందీగా తెలంగాణ
- 27న అమిత్‌షా సభను జయప్రదం చేయండి
- సన్నాహక సమావేశంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం మామిళ్లగూడెం: దేశంలో మోదీ ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టబోతోందని, వచ్చే ఎన్నికల్లో మరిన్ని సీట్లు పెరగనున్నట్లు సర్వేలన్నీ ఎన్‌డీఏకు అనుకూలంగా వస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఖమ్మంలో శుక్రవారం పర్యటించిన ఆయన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మోదీని ఎదుర్కోలేక కుటుంబ పార్టీలు, సిద్ధాంతాలు లేని పార్టీలు ఏకమవుతున్నాయని తెలిపారు. తొమ్మిదేళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశం కోసం, సమగ్రత కోసం నీతివంతమైన పాలన బీజేపీ అందించింగా.. ఎక్కడా నయాపైసా అవినీతి జరగలేదన్నారు. కాగా, వచ్చే నెల 17న విశ్వబ్రాహ్మణులకు కొత్త పథకం ప్రారంభించనున్నామని.. వడ్రంగి, కమ్మరి తదితర వర్గాల వారికి సాయం అందుతుందని తెలిపారు. ఇక ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారులను రూ.వేల కోట్లతో నిర్మించినట్లు చెప్పారు. కాగా, ఆత్మ బలిదానాలు చేసి తెచ్చుకున్న తెలంగాణ ప్రస్తుతం కల్వకుంట్ల కుటుంబం చేతిలో బందీ అయిందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 27న ఖమ్మంకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రానున్న నేపథ్యాన భారీగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కిషన్‌రెడ్డికి ఘనస్వాగతం

ఖమ్మం చేరుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఖమ్మంరూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఖమ్మం నగరంలోని కాల్వొడ్డు వద్ద స్వాగతం పలకగా, నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం ఎన్నెస్పీ గెస్ట్‌హౌజ్‌కు చేరుకున్న ఆయనకు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆ తర్వాత ఈనెల 27న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఖమ్మం రానుండడంతో సభ నిర్వహణ కోసం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. అనంతరం ఇటీవల హత్యకు గురైన బీజేవైఎం త్రీటౌన్ అధ్యక్షుడు కొప్పుల సాయి కుటుంబాన్ని కిషన్‌రెడ్డి పరామర్శించి పార్టీ తరఫున ఆర్థిక సాయం అందజేశారు. అలాగే, నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారి శృతి, బీజేపీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, కోనేరు సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డితో పాటు విజయరామారావు, మార్తినేని ధర్మారావు, నంబూరి రామలింగేశ్వరరావు, దొంగల సత్యనారాయణ, నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, ఉప్పల శారద, రుద్ర ప్రదీప్, శ్యాంరాథోడ్, అల్లిక అంజయ్య, వీరు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' పరిశీలన పూర్తి చేయండి

వీసీలో కలెక్టర్ గౌతమ్ ఆదేశం



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్ , పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఎఫ్ఓ సిద్ధార్థ్

ఖమ్మం సహకారనగర్: గృహలక్ష్మి పథకం ద్వారా అందిన దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కకలెక్టరేట్ నుంచి శుక్రవారం ఆయన వీసీ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీఓలతో గృహలక్ష్మి, బీసీ బంధు, హరితహారం, పోడు భూములు తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో గృహలక్ష్మి పథకం కింద 82,280 దరఖాస్తులు అందగా పారదర్శకంగా పరిశీలన చేయాలన్నారు. అలాగే, బీసీ బంధు ద్వారా ఆర్థిక సాయం అందుకున్న లబ్ధిదారులు నెలలోగా యూనిట్లు గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హరితహారంలో భాగంగా మిగిలిన 10లక్షలు మొక్కలను వారంలోగా నాటాలని, అర్హులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఇక శనివారం నియోజకవర్గ కేంద్రాల్లో జరగనున్న 5కే రన్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు.

అర్హులందరికీ పథకాలు

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి ఆమె వీసీ ద్వారా కలెక్టర్లకు పలు అంశాలపై సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ హరితహారంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిచేస్తామని తెలిపారు. అలాగే, గొర్రెల యూనిట్లు గ్రౌండింగ్, బీసీ బంధు, జేపీఎస్‌ల క్రమబద్ధీకరణ, గృహలక్ష్మి దరఖాస్తు పరిశీలన పురోగతిని వివరించారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, జెడ్పీ సీఈఓ అప్పారావు, వివిధ శాఖల అధికారులు వేణుమనోహర్, మహమూది, జి.జ్యోతి, కె.సత్యనారాయణ, కృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ అరుణ, సూపరింటెండెంట్లు మదన్‌గోపాల్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రాంబాబు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ప్రొఫెసర్లతో భేటీ

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం రూరల్: జిల్లాలోని పాలేరు నియోజకవర్గానికి ఇటీవల జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నేపథ్యాన జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు ఎం.మంజూర్ హుస్సేన్, రవీందర్‌రెడ్డి శుక్రవారం జిల్లాకు వచ్చారు. తొలుత వారు ఖమ్మంరూరల్ మండలంలోని మద్దులపల్లిలో ప్రతిపాదిత స్థలం, తాత్కాలిక భవనాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ భేటీ అయి పలు అంశాలపై చర్చించారు.

చిన్నారులకు గుండె సంబంధిత పరీక్షలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ శ్రీనివాసరావు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో శుక్రవారం చిన్నారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రికి చెందిన కార్డియాలజీ విభాగం వైద్యులు పాల్గొని పిల్లలకు పరీక్షలు చేశారు. ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం ద్వారా ఏడాది నుండి 19 ఏళ్ల మధ్య పిల్లలకు అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో వాహనాల ద్వారా వైద్యపరీక్షలు చేయిస్తోంది. అక్కడ ఏదైనా సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి పంపిస్తున్నారు. ప్రస్తుతం సుమారు 90 మంది చిన్నారులకు గుండె సంబంధిత సమస్య ఉన్నట్లు తేలడంతో ఖమ్మంలో పరీక్షలు చేయగా, తీవ్రమైన సమస్య ఉంటే హైదరాబాద్ తరలించి మెరుగైన చికిత్స అందించనున్నారు. శిబిరానికి జిల్లా నలుమూలల నుండి చిన్నారులు, వారి తల్లిదండ్రులు రాగా ఇరుకైన గదుల్లో శిబిరం నిర్వహించి అధికారులు కూర్చోవడానికి కుర్చీలు, తాగునీరు సమకూర్చకపోవడంతో ఇబ్బంది పడ్డారు. ఈ శిబిరాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావు ప్రారంభించగా డీఐఓ డాక్టర్ ప్రమీలతో పాటు వైద్యనిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు.

తడబడినా.. అదిరింది!

- వైన్స్ కోసం వెల్లువెత్తిన దరఖాస్తులు
- జిల్లావ్యాప్తంగా 122 షాపులకు 7,199 టెండర్లు
- ప్రభుత్వానికి రూ.143.98 కోట్ల ఆదాయం
- అగ్రభాగాన ఖమ్మం ఎక్సైజ్‌స్టేషన్–1, ఆఖరులో సింగరేణి
- ఈనెల 21న డ్రా ద్వారా కేటాయింపు



ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్ - 1లో బారులుదీరిన దరఖాస్తుదారులు

ఖమ్మంక్రైం: నూతన ఎక్సైజ్ పాలసీలో భాగంగా జిల్లాలోని 122 వైన్స్ కేటాయించేందుకు టెండర్లు స్వీకరించగా వ్యాపారులు పోటాపోటీగా దాఖలు చేశారు. ఈనెల 4వ తేదీన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి అదేరోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. అయితే, మొదట్లో దరఖాస్తులు పెద్దగా అందకపోవడంతో అధికారులు వివిధ వర్గాల వ్యాపారులను కలిసి టెండర్లకు ఆహ్వానించారు. కానీ గడువు ముగిసిన శుక్రవారం సాయంత్రంకల్లా భారీగా దరఖాస్తులు నమోదు కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గత సంవత్సరం 6,212 దరఖాస్తులు రాగా, ఈసారి 7,199 దరఖాస్తులు అందడం విశేషం. ఒక్కో టెండర్‌కు రూ.2లక్షల చొప్పున జిల్లా నుంచి రూ.143.98 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరింది.

డిమాండ్ ఆధారంగా టెండర్లు

జిల్లాలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో డిమాండ్ షాపుల ఆధారంగా టెండర్లు దాఖలయ్యాయి. జిల్లా కేంద్రంతో పాటు రహదారుల సమీపాన, ప్రధాన రహదారి వెంట ఉన్న మండల కేంద్రాల్లోని షాపులు దక్కించుకునేందుకు వ్యాపారులు పోటీ పడినట్లు తెలుస్తోంది. దీనికి తోడు 40 షాపులను ఎస్సీ, ఎస్టీ, గౌడ కులాలకు రిజర్వ్ చేశారు. అయితే, ఆయా షాపులకు కూడా బాగానే దరఖాస్తులు అందాయి. కొందరు సిండికేట్‌గా దరఖాస్తులు నమోదు చేయగా.. మరికొందరు వ్యాపారులు తమ బినామీల ద్వారా టెండర్లు వేయించినట్లు తెలుస్తోంది.

గతం కంటే ఎక్కువ

గత ఎక్సైజ్ పాలసీ కంటే నూతన ఎక్సైజ్ పాలసీలో దరఖాస్తుల సంఖ్య పెరిగింది. తొలినాళ్లలో టెండర్లు మందకొడిగా వస్తుండడంతో అధికారులు ఆందోళన చెందారు. చాంబర్ ఆఫ్ కామర్స్ తదితర వ్యాపారవర్గాలతో సమావేశమై టెండర్లు దాఖలు చేయాలని సూచించారు. కానీ గడువు ముగిసే నాటికి పోయిన ఏడాదితో పోలిస్తే దరఖాస్తులు పెరగగా అధికారులు ఆనందంగా ఉన్నారు. ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1 పరిధి షాపులకు అత్యధికంగా 1,747 దరఖాస్తులు అందగా, సింగరేణి పరిధిలో 421 దరఖాస్తులే వచ్చాయి. కాగా, మొత్తం 7,199 దరఖాస్తుల్లో చివరిరోజైన శుక్రవారమే 2,886 దరఖాస్తులు అందాయి.

పోటెత్తిన దరఖాస్తుదారులు

మొదట్లో అంతంత మాత్రంగానే టెండర్లు దాఖలయ్యాయి. కానీ నిజ శ్రావణ మాసం మొదలైన గురువారంతో పాటు చివరి రోజు శ్రావణ శుక్రవారం కావడంతో వ్యాపారులు పోటెత్తారు. పాత వ్యాపారులే కాక కొత్తగా మద్యం వ్యాపారంలోకి రావాలని భావించిన వారితో పాటు ఏపీలోని వివిధ జిల్లాల వ్యాపారులు ఎక్కువగా దరఖాస్తులు దాఖలు చేశారు. చివరిరోజు ఉదయం కార్యాలయాలు ఖాళీగానే కనిపించినా సాయంత్రం 3గంటల నుంచి రద్దీ పెరిగింది. కాగా, ఈనెల 21న సీక్వెల్ ఫంక్షన్ జరిగే లక్కీ డ్రాలో షాపులు కేటాయించనున్నారు.



దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న ఎక్సైజ్ డీసీ జనార్ధన్‌రెడ్డి, ఈఎస్ నాగేందర్‌రెడ్డి

బడుగుల అభ్యున్నతికి పాటుపడిన పాపన్నగౌడ్



నివాళులర్పిస్తున్న మేయర్ నీరజ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: బహుజనులు, అణగారిన పేదల అభ్యున్నతి కోసం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అనునిత్యం పాటుపడ్డాడని మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా శుక్రవారం లకారం ట్యాంక్ బండ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బహుజనులు, అణగారిన, పేదప్రజల ఆత్మగౌరవం కోసం పాపన్న పోరాడారన్నారు. ఆయన గౌడ కులానికే కాకుండా బీసీ సామాజిక వర్గాలు, అన్ని కులాలకు సహకరించిన ధీరుడని, పెత్తందారులను ఎదురించి పేదలకు అండగా నిలిచారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుడా, మార్కెట్ చైర్మన్లు బచ్చు విజయ్‌కుమార్, దోరేపల్లి శ్వేత, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జి.జ్యోతి, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూ గౌడ్‌తో పాటు బిచ్చాల తిరుమలరావు, బొలగాని శ్రీనివాసరావు, అమరగాని వెంకన్న, బండి నాగేశ్వరావు, మంద రామారావు, శ్రీనివాస్, కృష్ణమాచారి, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రిసెప్షన్ కౌంటర్‌ను ప్రారంభించిన జిల్లా జడ్జి



రిసెప్షన్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్

ఖమ్మం లీగల్: న్యాయవాద సహకార సంఘం రిసెప్షన్ కౌంటర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్ జగ్జీవన్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. న్యాయవాదులు న్యాయవాద గుమస్తాలు, కక్షిదారులకు ఇది ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. అలాగే, న్యాయవాద సహకార సంఘం అధ్యక్షుడు కె.రాజశేఖర్‌రెడ్డి చొరవతో ఒక ఉద్యోగిని నియమించి పిటీషన్లు, ఫీజు టికెట్లు, స్టేషనరీని అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కష్టారావుతో పాటు కార్యవర్గ బాధ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎంపిక పోటీలకు 30 మంది హాజరు



మెడిసిన్ బాల్‌త్రో పరీక్షలో పాల్గొన్న క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) ఆధ్వర్యాన ఖమ్మంలోని అథ్లెటిక్స్ అకాడమీలో ఖాళీగా ఉన్న పదిహేను స్థానాల భర్తీకి శుక్రవారం ఎంపిక పోటీలు నిర్వహించారు. స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన పోటీలకు నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 30 మంది అథ్లెట్లు హాజరయ్యారు. వారికి బ్యాటరీ టెస్ట్ నిర్వహించి అత్యధిక పాయింట్లు సాధించిన 14 మందితో జాబితాను శాట్స్‌కు పంపామని, అక్కడి నుంచి వచ్చే సమాచారం ఆధారంగా అకాడమీలో ప్రవేశం కల్పిస్తామని డీవైఎస్‌ఓ టి.సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. పోటీలను రాజేశ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సారంగపాణి, ఎస్.రాధాకృష్ణ పర్యవేక్షించగా, ఖమ్మం అకాడమీ కోచ్‌లు ఎండీ గౌస్, ఎండీ అక్బర్‌అలీ, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎండీ షఫీక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీల భర్తీ కోసం స్పాట్ కౌన్సెలింగ్

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో మిగిలిన ప్రథమ సంవత్సరం సీట్ల భర్తీ కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 21న ఇల్లెందు వైటీసీ భవనంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

వర్షంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సత్తుపల్లిరూరల్: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో బొగ్గు గనుల్లోకి నీరు చేరింది. దీంతో సత్తుపల్లి మండలం జేవీఆర్‌ఓసీ, కిష్టారంఓసీల్లో బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీతకు అంతరాయం ఏర్పడింది. గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం భారీ వర్షం కురవడంతో రెండు ఓసీల్లో 30 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 80 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు నిలిచిపోయిందని అధికారులు తెలిపారు.

లారీ - బొలేరో ఢీ.. ఇద్దరికి గాయాలు



ఘటనాస్థలంలో వాహనాలు

తిరుమలాయపాలెం: మండలంలోని తెట్టెలపాడు క్రాస్‌రోడ్డు వద్ద లారీ, బొలేరో వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వైజాగ్ నుండి ఐరన్ లోడుతో గుజరాత్ వెళ్తున్న లారీ తెట్టెలపాడు క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే చేపల లోడుతో తొర్రూరు వైపు నుండి ఖమ్మం వస్తున్న బొలేరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఖమ్మం చెందిన బొలేరో డ్రైవర్ వీరన్న, క్లీనర్ లోకేష్ గాయపడడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,500	6,100
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	24,400	18,500
పత్తి	7,650	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,091

గద్దర్ పాటకు మరణం లేదు..

- ఆటపాటలతో ఉద్యమాలకు ఊపు తెచ్చిన ఘనత ఆయనదే..
- గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్ సంస్మరణ సభలో వక్తలు



గద్దర్, జహీరుద్దీన్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న పోటు రంగారావు, విమలక్క తదితరులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న



ఖమ్మంమయూరిసెంటర్: భౌతికంగా దూరమైనా విప్లవ గీతాలు, చైతన్య భరితమైన పాటలతో గద్దర్ గాత్రం ఎప్పటికీ సజీవంగానే ఉంటుందని ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, విమలక్క పేర్కొన్నారు. ప్రజా గాయకుడు, యుద్ధనౌక గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్ సంస్మరణ సభ ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత అరుణోదయ ప్రజా నాట్యమండలి, సాంస్కృతిక సారథి, జానపద కళా సాంస్కృతిక సంస్థల బాధ్యులతోపాటు డప్పు కళాకారులు నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం దేవిరెడ్డి విజయ్ అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాకారులు ఆలపించిన గద్దర్ పాటలతో కళాక్షేత్రం మార్మోగింది. ఈ సందర్భంగా గోరేటి వెంకన్న, విమలక్క మాట్లాడుతూ గద్దర్ తన రచనలు, గానంతో ప్రపంచాన్ని చైతన్యపరిచాడని, ఆయన పాటలతో ఎన్నో ఉద్యమాలు ఊపిరి పోసుకున్నాయని గుర్తుచేశారు. గద్దర్ ప్రతీ పాట ప్రజల మధ్య నుంచే పుట్టిందని తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో గద్దర్ పాటలతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిందని పేర్కొన్నారు. అలాగే, జహీరుద్దీన్ అలీఖాన్ తన ప్రసంగాలు, చర్చల ద్వారా సామాన్యులను సైతం ఆలోచింప చేశారని తెలిపారు. ఈ సందర్భంగా గాయిబోళ్ల గంగ్రగొడ్డలి పాటల సీడీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, అరుణోదయ నాగన్న, డాక్టర్ ఎం.ఎఫ్.గోపీనాథ్, డాక్టర్ కే.వీ.కృష్ణారావు, ఆవునూరి మధు, స్పర్శ భాస్కర్, చిర్రా రవి, రవిమారుత్, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ముగ్గులతో నిరసన

మూడో రోజుకు చేరిన ఏఎన్‌ఎంల సమ్మె



కలెక్టరేట్ ఎదుట ముగ్గు వేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

ఖమ్మంమయూరిసెంటర్: కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానంలో పదిహేనేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో ఏఐటీయూసీ ఆధ్వర్యాన చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరింది. ఈసందర్భంగా కలెక్టరేట్ ప్రధాన గేట్ ఎదుట ముగ్గులు వేసి నిరసన తెలిపారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కోవిడ్ సమయాన ప్రాణాలను లెక్కచేయకుండా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించిన సెకండ్ ఏఎస్‌ఎం సేవలను ప్రభుత్వం ఇకనైనా గుర్తించాలని డిమాండ్ చేశారు. పదిహేనేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారిని కాదని, కొత్త వారి నియామకానికి నోటిఫికేషన్ జారీ చేయడం గర్హనీయన్నారు. ప్రభుత్వం సెకండ్ ఏఎస్ఎంల శ్రమను గుర్తించి ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సెకండ్ ఏఎస్‌ఎం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు వనజతోపాటు , విజయకుమారి, నాగమణి, సునీత, ధనలక్ష్మి, నరసమ్మ, శైలజ, కృష్ణవేణి, సునీత, పోచపు రాజ్యలక్ష్మి, హేమలత, విజయమ్మ, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ టికెట్ కోసం మానవతారాయ్ దరఖాస్తు



దరఖాస్తు అంజేస్తున్న మానవతారాయ్

సత్తుపల్లి: సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు కోటూరి మానవతా రాయ్ దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన దరఖాస్తు ఫారాన్ని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు అందజేశారు. అనంతరం పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని కలిసి సత్కరించారు. ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సెక్రటరీ రావి నాగేశ్వరరావు, నాయకులు దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాగరాజ్‌గౌడ్, భిక్షపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పర్వతారోహకుడికి రూ.35 వేలు ఆర్థికసాయం



మోతీకుమార్‌కు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కల్లూరు: రష్యాలోని మౌంట్ ఎల్‌బ్రూస్ పర్వతం అధిరోహించనున్న పెనుబల్లి విద్యార్థి బర్మావత్ మోతీకుమార్‌కు కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1982 బ్యాచ్ విద్యార్థులు అండగా నిలిచారు. బర్మావత్ రామ్‌జా - అలివేలు కుమారుడు మోతీకుమార్ గతంలో దక్షిణాఫ్రికాలోని కిలీమంజారో పర్వతాన్ని అధిరోహించాడు. ఇప్పుడు ఎల్‌బ్రూస్ పర్వతాన్ని అధిరోహించాలనే లక్ష్యంతో అరుణాచలప్రదేశ్‌లో శిక్షణ పొందాడు. త్వరలోనే రష్యా వెళ్లాల్సి ఉండగా రూ.3.40 లక్షలు వ్యయం కానుండడంతో దాతల చేయూత కోరాడు. ఈ మేరకు కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1982 పూర్వ విద్యార్థులైన ఎంపీఐ సంగం వెంకటపుల్లయ్య తదితరులు శుక్రవారం ఆయనకు రూ.35 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌కే అమీరుద్దీన్, పెద్దబోయిన దుర్గాప్రసాద్, సంకా కోటేశ్వరరావు, చుండూరి నాగేంద్రబాబు, కనకాచారి, మాడిశెట్టి వెంకటేశ్వరరావు, పెద్దబోయిన శ్రీనివాసరావు, ఉస్మాన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కూసుమంచి: ఉపాధి హామీ పథకం అమలులో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ అదనపు పీడీ శిరీష స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆమె పాల్గొన్నారు. తొలుత మండలంలో జరిగిన రూ.15.50 కోట్ల విలువైన పనులపై తనిఖీలో వెల్లడైన అంశాలను ఆర్‌పీలు వివరించారు. ఈసందర్భంగా నాటిన మొక్కలు చనిపోవటం, మస్టర్ల నమోదులో తప్పులు, కూలీలకు పని కల్పించలేదని తేలడంతో ఏపీడీ సిబ్బందిని మందలించారు. సుమారు రూ.50వేల వరకు సిబ్బందికి జరిమానా విధించారు. ఈ సమావేశంలో ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, ఎంపీడీఓ రమాదేవి, అధికారులు శ్రీనివాసరావు, రమేష్, రమేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీ రన్నరప్‌గా ఖమ్మం



బెస్ట్ ప్లేయర్‌గా ఎంపికైన గోపీచంద్, రన్నరప్‌గా నిలిచిన జిల్లా ఫుట్‌బాల్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: వనపర్తి జిల్లా పెబ్బేరులో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు పోటీలు జరగగా, వరుస విజయాలతో ఫైనల్స్‌కు ప్రవేశించినన ఖమ్మం జట్టు రంగారెడ్డిపై 2-0 గోల్స్‌తో తేడాతో ఓటమి పాలైంది. కాగా, టోర్నీలో జిల్లాకు చెందిన గోపీచంద్ బెస్ట్ ప్లేయర్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సెల్యూకాస్, కె.ఆదర్శ్ కుమార్‌తో పాటు రమణ తదితరులు అభినందనలు తెలిపారు.

'సూరపునేని' సేవలు మరువలేనివి



వర్ధంతి సభలో పాల్గొన్న డీఈఓ సోమశేఖరశర్మ, ట్రస్మా బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) రాష్ట్ర బాధ్యులు, నిర్మల్ స్కూల్ అధినేత సూరపునేని శేషుకుమార్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఖమ్మంలో శుక్రవారం శేషుకుమార్ ప్రథమ వర్ధంతి నిర్వహించగా.... డీఈఓ సోమశేఖర శర్మ, ఫేమా కన్వీనర్ ముదా శ్రీనివాసరావు, ట్రస్మా నాయకులు హాజరై మాట్లాడారు. విద్యావ్యవస్థను కాపాడటంలో శేషుకుమార్ కీలకపాత్ర పోషించారని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బొగ్గారపు రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మధు, కోశాధికారి రమణారావు, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావు, ప్రైవేట్ విద్యాసంస్థల బాధ్యులు ప్రభాకర్‌రెడ్డి, శేషగిరి, కొల్లి సత్యనారాయణ, ఇస్మాయిల్, ఎస్.భాస్కర్, ఆక్స్‌ఫర్డ్ జాఫర్ మతిన్, న్యూవిజన్ ప్రసాద్, హార్వెస్ట్ రవిమారుత్ తదితరులు పాల్గొన్నారు.

లారీ నుంచి 250 లీటర్ల డీజిల్ చోరీ

కల్లూరు: పట్టణంలోని జాతీయ రహదారిపై మినీ స్టేడియం సమీపాన నిలిపిన లారీ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.24 వేల విలువైన 250 లీటర్ల డీజిల్ చోరీ చేశారు. హర్యానాకు చెందిన డ్రైవర్ జమీల్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాపూర్ నుంచి సిమెంట్ లోడ్‌తో గురువారం వచ్చిన తాను సత్తుపల్లి వచ్చి సగం దిగుమతి చేసి, మిగిలిన లోడ్ కల్లూరులో దిగుమతి చేయాల్సి ఉందన్నారు. ఇంతలోనే రాత్రి కావడంతో లారీని రహదారి పక్కన పార్కింగ్ చేసి నిద్రించగా, శుక్రవారం తెల్లారేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ట్యాంక్ ఓపెన్ చేసి 250 లీటర్ల డీజిల్ చోరీ చేశారన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య



జగన్నాథం (ఫైల్)

పెనుబల్లి: మద్యం తాగేందుకు డబ్బులు అడిగితే తల్లి ఇవ్వకపోవడంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని లంకపల్లికి చెందిన భోగి ముత్యవతి - అంజయ్య కుమారుడు జగన్నాథం మద్యానికి బానిసై తరచూ తల్లిని డబ్బు అడిగితేవాడు. ఈక్రమంలో గురువారం రాత్రి కూడా డబ్బులు అడగగా ఆమె లేవని చెప్పడంతో గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే, శుక్రవారం ఉదయం ఆయనకు వెళ్లి చూడగా ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు వీఎం బంజర్ పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని ఆశ కార్యకర్త మృతి

కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన



విజయ (ఫైల్)



ఆందోళన చేస్తున్న బంధువులు, ఆశ కార్యకర్తలు

రఘునాథపాలెం: మండలంలోని కే.వీ.బంజర వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు ఢీకొనగా మంగ్యాతండాకు చెందిన ఆశా కార్యకర్త బానోత్ విజయ(38) అక్కడికక్కడే మృతి చెందింది. ఇదే ప్రమాదంలో ఆమె భర్త రవి తీవ్ర గాయాలయ్యాయి. రఘునాథపాలెం ఎస్సై కొండలరావు కథనం ప్రకారం... ఆశా కార్యకర్త విజయ విధుల్లో పాల్గొనేందుకు బయలుదేరగా, మంగ్యాతండాలోని ఇంటి నుండి భర్త రవి ద్విచక్రవాహనంపై తీసుకెళ్తున్నాడు. అదే సమయాన ఏన్కూరు నుండి ఖమ్మం వెళ్తున్న ఖమ్మం డిపో అద్దె బస్సు అతివేగంగా వచ్చి ఎదురుగా వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో విజయ కింద పడగానే బస్సు వెనక టైర్ ఆమె పైనుంచి వెళ్లడంతో తల నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందినది. అలాగే, వాహనం నడుపుతున్న ఆమె భర్త రవికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.

బయలుదేరిన ఐదు నిమిషాల్లోనే...

ఆశ కార్యకర్త విజయ ప్రతిరోజు మంగ్యాతండా నుంచి కే.వీ.బంజర వెళ్లి విధులు నిర్వరిస్తోంది. శుక్రవారం కూడా ఇద్దరు పిల్లలను పాఠశాలకు పంపించాక ఆమెను భర్త తీసుకెళ్తున్నాడు. విజయను దింపేసి రవి పొలానికి వెళ్లాల్సి ఉంది. ఇంటినుంచి బయలుదేరిన ఐదు నిమిషాల్లోనే బస్సు రూపంలో మృత్యువు ఎదురొచ్చింది. ఇంకో ఐదు నిమిషాల్లో ఇంట్లోనే ఉన్నా ముప్పు తప్పేదని కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా రోదించారు. కాగా, విజయ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సహచర ఆశ కార్యకర్తలు, బంధువులు, సీఐటీయూ నాయకులు బస్సు ఎదుట రహదారిపై ఆందోళనకు దిగారు. ఈమేరకు డీఎంహెచ్‌ఓ మాలతి, అధికారులు చేరుకుని బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. అలాగే, ఆర్టీసీ ఖమ్మం డీఎం సైతం చేరుకుని వివరాలు ఆరా తీశారు. కాగా, ప్రమాదం జరగగా డ్రైవర్ బస్సు వదిలేసి పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు.

లైంగిక వేధింపులపై కేసు

సత్తుపల్లి: పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలికపై డ్రైవర్ యాకోబు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయమై బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. మండలంలోని మంగాపురంతండాకు చెందిన తేజావత్ నాగేశ్వరరావు(50) మరొకరితో కలిసి గురువారం బైక్‌పై నేలకొండపల్లి నుంచి ఇంటికి వస్తుండగా... నాచేపల్లి బ్రిడ్జి వద్ద ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావును ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జ్వరం, కిడ్నీ వ్యాధితో వ్యక్తి...

కారేపల్లి: జ్వరంతో పాటు కిడ్నీల పనితీరు మందగించడంతో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని బాజుమల్లాయిగూడెంకు చెందిన బొడ్డు రాజ్‌కుమార్(38)కు వారం క్రితం తీవ్రమైన జ్వరం రావటంతో ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించుకున్నాడు. అయినా ఫలితం లేకపోగా ఈనెల 17న ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన కిడ్నీలు ఫెయిల్ కావటంతో శుక్రవారం మృతి చెందాడు. కాగా, రాజ్‌కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయమై కారేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్‌ను వివరణ కోరగా రాజ్‌కుమార్‌కు జ్వరం రావటంతో ఆర్‌ఎంపీతో చికిత్స చేయించుకుని, ఆతర్వాత ఖమ్మం వెళ్లగా మూత్రపిండాలు చెడిపోయి మృతి చెందినట్లు తెలిసిందని చెప్పారు. ఎవరికైనా జ్వరం వస్తే ఆరోగ్య కేంద్రాలకు రావాలని సూచించారు.

వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో 'ఉప్పలమ్మ' వేడుక



పూజలో పాల్గొన్న ఉద్యోగులు, టీఎన్జీవోస్ బాధ్యులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం బుర్హాన్‌పురంలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులు ఉప్పలమ్మ తల్లి వేడుక జరుపుకున్నారు. గతంలో ఈ భవనంలో వ్యవసాయ శాఖ కార్యాలయం కొనసాగగా, ఆ కార్యాలయాన్ని కలెక్టరేట్‌కు తరలించడంతో వాణిజ్య పన్నుల శాఖకు కేటాయించారు. దీంతో గత ఆనవాయితీకి కొనసాగింపుగా ఉప్పలమ్మ వేడుక నిర్వహించారు. శాఖ ఉద్యోగుల ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు మజీద్, అనుదీప్, రాజేష్, టీఎన్జీవోస్ ప్రతినిధులు అఫ్జల్ హసన్, నందగిరి శ్రీను, జీఎస్.ప్రసాద్‌రావు, చంద్రశేఖర్, రామకృష్ణ, శ్రీను, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, ప్రసాద్, ఏసీటీఓలు శ్రీరాం, సుబ్బారావు, డీసీటీఓ భాస్కర్, సీటీఓ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి సాయంగా వెళ్లి కరెంట్‌కు బలి

విద్యుదాఘాతంతో సివిల్స్ శిక్షణార్థి మృతి



ప్రవీణ్ (ఫైల్)

ఖమ్మంఅర్బన్: జీవితంలో అత్యున్నత స్థాయికి చేరాలనుకుని ఢిల్లీలో సివిల్స్‌కు శిక్షణ తీసుకుంటున్న ఆ యువకుడి కలలను కరెంట్ ఛిద్రం చేసింది. సరదాగా రెండు రోజులు స్నేహితుడితో గడుపుదామని వచ్చిన ఆయన స్నేహితుడి పనిలో సాయంగా వెళ్లి షాక్‌తో మృతి చెందాడు. వివరాలు.. పాల్వంచకు చెందిన భూక్యా ప్రవీణ్ (23) ఢిల్లీలో ఉంటూ సివిల్స్ శిక్షణ తీసుకుంటున్నాడు. ఖమ్మంలో ఆయన స్నేహితుడైన బానోత్ శ్రీనివాస్ ఉండగా, ఆయనతో రెండు రోజులు గడపాలని ఈ నెల 15న వచ్చాడు. కాగా, ఫ్లెక్సీ బోర్డుల తయారీ షాపులో పనిచేసే శ్రీనివాస్ ఓ ఫ్లెక్సీ ఏర్పాటు చేసేందుకు గురువారం వెళ్తుండగా ప్రవీణ్ కూడా బయలుదేరాడు. ఖమ్మంలోని మమత రోడ్డులో భవనం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ తీగలు తాకి ఇద్దరు షాక్‌కు గురయ్యారు. దీంతో స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ప్రవీణ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. అలాగే, తీవ్ర గాయాలైన శ్రీనివాస్ చికిత్స పొందుతున్నాడు. ఘటనపై ప్రవీణ్ తండ్రి ప్రేమ్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి తెలిపారు.

దహన సంస్కారాల్లో స్థలవివాదం

కారేపల్లి: దహన సంస్కార కార్యక్రమంలో వివాదం చోటు చేసుకోగా, పోలీసులు రంగప్రవేశం చేసి సర్దిచెప్పాల్సి వచ్చింది. మండలంలోని లింగంబంజరలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మోడేపల్లి అప్పయ్య(80) శుక్రవారం మృతి చెందగా కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించేందుకు చెరువు ఒడ్డుకు వచ్చారు. అయితే, ఇటీవల వర్షాలతో చెరువు పూర్తిగా నిండగా, గ్రామానికే చెందిన దాత ఓ సామాజిక వర్గానికి ఇచ్చిన స్థలం పక్కనే జాగాలో దహన సంస్కారాలకు సిద్ధమయ్యారు. అయితే, కొందరు చేరుకుని అది తమ పట్టా భూమి అని అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న కారేపల్లి ఎస్ఐ పుష్పాల రామారావు చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెప్పారు. వివాదాస్పద భూమిని త్వరలోనే రెవన్యూ అధికారులతో సర్వే చేయించి హిందూ శ్మశానవాటికకు అప్పగించేలా చొరవ తీసుకుంటానని చెప్పడంతో సమస్య పరిష్కారమైంది.